# నీరు పల్లమెరుగు

మంథా వెంకటరమణారావు



సుంకిఘాటీ కొండల మీదనుంచి మేఘాలు తేలుతూ వస్తున్నాయి, తెల్లగా, నిండుగా—ఆడుతూ పాడుతూ స్వర్గం నించి భూలోక సంచారానికి పురాణకాలంలో వచ్చే దేవకన్యలలా. మేఘాలు నేలని తాకుతూ బరువుగా వచ్చి, తాటికమ్మలతో కట్టిన రామో హోటల్‌లోకి ప్రవేశించి, కూర్చున్న అందరినీ చలితో ఒక్కసారి గజగజలాడించి బయటకు పోతున్నాయి.

'చెక్‌గేట్'నీ, హోటలునీ, తక్కిన ఇళ్లనీ చుట్టబెడుతూ నాలుగువైపులా ఎత్తయిన కొండలున్నాయి, మేఘాలు కప్పిన చోట వెండి రంగులోనూ, కప్పని చోట పచ్చగానూ అగుపడుతూ నూతికున్న గోడలలా ఉన్నాయి కొండలు—నూతిలోని కప్పలా ఉందా పల్లె—పల్లె అనడానికీ అవదు. ఆంధ్రా—ఒరిస్సా సరిహద్దు దగ్గరున్న సివిల్ సప్లయి 'చెక్‌పోస్ట్' అవడాన్ని చుట్టూ పదిపన్నెండు పూరిళ్లు లేచేయి. అందులో ఉన్న వారంతా బియ్యం దొంగతనంగా సరిహద్దు దాటించే వ్యాపారస్తులే—అక్కడ ఉన్న పెంకుటిళ్లు, రహదారి బంగళా, పోలీస్టేషను, చెక్‌పోస్ట్.

ఉదయం ఆరుగంటల నించి, రాత్రి పదిగంటల వరకు సాలూరు నించి జయపురానికీ, జయపురం నించి సాలూరుకి పోయే లారీలు, బస్సుల సంఖ్య కనీసం ఉంటుంది రెండు వందలు. అవన్నీ అక్కడ ఆగవలిసిందే తనిఖీ కోసం.

ప్రొద్దు అప్పుడే పొడిచింది— సాలూరు నించి లారీలు, ఒక్కొక్కటే వచ్చి ఆగుతున్నాయి. అటు జయపురం నించి బియ్యం బస్తాలు నింపుకొని తెల్లవారు జామున బయలుదేరిన సివిల్ సప్లయి బళ్లు ఒక్కటొక్కటే, చెవులు దిమ్మలు పడేటట్టు శబ్దం చేసుకుంటూ, రెండో గేరులో ఘాటీ దిగుతున్నాయి, **పాము మెలికల్లాంటి రోడ్డు మీంచి నాలుగు మైళ్ళ దూరం ఆ కొండ చరియల పైకి** రోడ్డు, దాని మీద ఎక్కే దిగే మోటారు బళ్లు హోటలు నించి కనిపిస్తున్నాయి.

చెక్‌గేట్ ఆఫీసు తలుపు లింకా తియ్యలేదు—రోడ్డుకి అడ్డంగా ఉన్న గేటు తాళం కూడా వేసి ఉంది. బంట్రోతు పళ్లు తోముకుంటట, వీధి వరండాలో కూర్చున్నాడు, డ్రయివర్ల కేసి చూసి, పళ్లు ఇకిలించి నవ్వుతూ—

లారీ డ్రయివర్లు, క్లీనర్లు, లారీలో ప్రయాణం చేసే ఒకరో ఇద్దరో డబ్బివ్వని ప్రయాణీకులు, రామో హోటల్లోకి ఒక్కరొక్కరే తాపీగా ప్రవేశిస్తున్నారు. అది హోటల్లా లేదు—ఆవుల శాలలా ఉంది— మీదిని తాటికొమ్మలున్నాయి కాబట్టి, కొంతలో కొంత నయమైనా, గాలితో వర్షం పడితే నాలుగు వేపుల నించీ జల్లు కొడుతుంది— కర్ర దిమ్మలు రెండు వరసల్లో పాతబడి ఉన్నాయి—ఒక వరస ఎత్తు, రెండోది పల్లం—వాటి మీద పొడుగాటి బల్ల చెక్కలు మేకు వేసి కొట్టేరు—క్రింది వరస కుర్చీగానూ, మీది వరస టేబిలుగానూ వాడబడుతోంది— ఒక మూలకి ఉంది పెద్ద కొయిలా పొయ్యి, రెండు కొలిమిలతో, దాని ప్రక్కనే పాత టేబిలొకటి, కప్పులు, సాసర్లు తదితర సామగ్రి తోనూ. పొయ్యి మీద, మూడువంతులు నీళ్లు కలిపిన పాలు, మరుగుతున్నాయి—టీ అడిగినా, కాఫీ అడిగినా, డికాక్షను కాస్త గ్లాసులో వేసి, పంచదార రెండు చెమ్చాలు గబగబా గ్లాసులోకి కొట్టి, ఎల్యూమినియమ్‌తో పాలు కల్సిన మరుగుతున్న నీళ్లు అందులో పోసి, గజమున్నర ఎత్తు నించి రెండుమూడు సార్లు కలిపి ఇస్తున్నాడు రామో—టేబిలు మీదనున్న బేసిన్‌లో ఆవిర్లు కక్కుతూ ఇడ్లీలున్నాయి—దోసెల పెనం వేడెక్కుతోంది పొయ్యి మీద—

కండలు తిరిగిన రామో నిండైన విగ్రహం, సంపెంగ రంగు ఛాయ కలిగి, నలభై సంవత్సరాలు పైబడ్డా, మధ్య వయస్సు పొలిమేరలు చేరుకోలేదు. స్నేహం కనపరచే పెద్దకళ్లు, సదా ఆకర్షణీయమైన చిరునవ్వు ఎవరినన్నా ఇట్టే అతడికి అప్పుడిగా మారుస్తాయి.

ఎంతమంది వచ్చి ఏవి అడిగినా, ఆలస్యం లేకుండా కబుర్లు చెప్తూనే, చిరునవ్వు నవ్వుతూనే అన్నీ అందిస్తున్నాడు రామో. ఈ లైన్‌లో వెళ్లే, డ్రయివర్లు, క్లీనర్లు, చాలామంది ప్రయాణీకులు, రామోకి సుపరిచితులు—అందరినీ, పేరు పేరునా పలకరించి, వాళ్ళు అడగకుండానే ఫలానాది కావాలని తెలుసుకొని అందిస్తున్నాడు.

ఇల్లుగా వాడుకుంటున్న భాగం చుట్టూ మాత్రం మట్టిగోడలున్నాయి. లోన రెండు గదులున్నాయి. ఒక గది నిండా సరుకులున్నాయి. రెండో గది పడక గది— వెనకకి ఒక చిన్న చావడి పంచ ఉంది. కొంత దూరంలో ఒక సెలయేరు ప్రవహిస్తోంది కొండ లోయలలోకి.

అక్కడ నిల్చొని, సెలయేటి గల గల వింటూ, కొండల నించి దిగే మేఘాల కేసి మగతగా,

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327 TEL

1969 లో మీ అదృష్టము
మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు సంవత్సరంలో జరుగు

ముఖ్య సంఘటనలు అనగా వ్యాపారం లాభ నష్టాలు, సర్వీసులో ప్రమోషన్ ట్రాన్స్‌ఫరు, పిల్లల జననం, వివాహం సుఖ సంతోషాలు మరియు చెడు నక్షత్రముల శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజి అదనం. ఒకవేళ మా చిట్కా పని చేయకపోతే ఫలితం పొందగలరు.
PT. DEV DUTT SHASTRI
RAJ JYOTSHI (MAP)
P. B. 86. JULLUNDUR CITY.

చేతి గడియారం
రు 6/—లకు మాత్రమే

5 జ్యూయల్సుగల చేతి గడియారం, 5 యేండ్ల గ్యారంటీతో రు. 6/—లకే మా వెయివ్ పద్ధతి స్కీముద్వారా పొందండి. పోస్టేజి రు 1,15 అదనం.
షరా : మా హనిమూన్ సెంట్ వ్యాపారాభివృద్ధికై ఈ స్కీము పెట్టబడింది. ఇష్టంలేని వారికి డబ్బు వాపసు చేయబడును.
SWISS WATCH TRADING Co.
P B. 87 (APT) Jullundur City

# నీరు పల్లమెరుగు

చెప్పలేదు—మర్నాడు మళ్ళాసత్యం, ఇంటికి వస్తే వద్దనీ చెప్పలేదు.

తనూ (రామో) వెళ్లేవాడు— తన కోరిక కని పెట్టలేకపోలేదు అలివేలు. కాని తన కోరిక, స్నేహ ధర్మం ముందు తలవంచింది— మనసులో కోరిక మనసులోనే ఉండిపోయింది— "బావగారు సాలా తగు మనుషులు!" అని వెటకారం చేసేది అలివేలు. కన్పించేది తనని, అందకుండా దూరంగానే ఉంటూ.

సాంబకి అలివేలుమీద అనుమానం కలగడం సహజం. అది సత్యం ప్రవర్తనతో హెచ్చయింది— ఒకోనాడు, రాత్రి పదింటికి ట్రిప్పునించి ఇంటికి రాగానే, సత్యం అలివేలూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చోడం చూసేవాడు. సత్యాన్ని హెచ్చరించేడు తను లేనపుడు తన ఇంటికి రావద్దని. అలివేలుని బెదిరిస్తే, "ఆడొస్తే, నావేం చేసేది!" అనేది.

రానురానూ అలివేలుని హింసించడం ప్రారంభించేడు. తాగొచ్చి, నానా దుర్భాషలు ఆడడం, ఎదురు జవాబిస్తే తన్నడం చేసేవాడు— ఒకరోజు రాత్రి పదకొండుకి బాగా తాగి ఒచ్చేడు సాంబడు. అలివేలు సత్యంతో నవ్వుతూ మాట్లాడుతోంది. చిన బుడ్డి దీపం వెలుగులో ఇల్లంతా చీకటిగా ఉంది. వస్తూనే ఆరంభించేడు సంఘర్షణ. ఇద్దరికీ సంబంధం కట్టి ఇద్దరినీ బూతులు తిట్టేడు సాంబడు. అలివేలు జుత్తుపట్టుకొని గొరగొరా ఈడ్చి చావబాదేడు— సత్యం అడ్డు పడగానే వాడి పొకతాపుతన్ని వాడిమీద కలియబడ్డాడు. "సెప్పు నంజకొడుకా! నిజం సెప్పు! నిను నరికేస్తాను"— దాంతో సత్యం బాగా ఉగ్రుడయిపోయేడు. "సంబంధం ఉంటే ఉంటాదిరా కైరాతియెధవా! పెళ్లాం పిల్లలున్న ముసలి నా కొడుకువి, నీ కెందుకురా పడుసు గుంట? నాలాటి మడిసితో ఉంటే దానికి రాణింపు కాని, తాగుమోతుయెదవ్వి నీతోదానికి మనువేటి? పదే అలివేలా.... నాతో పద!" అంటూ అలివేలుని లేవదియ్యబోయేడు. అంతే— ముందు వెనకలాలోచించకుండా, సాంబడు, బాణాకర్రతీసి సత్యాన్ని తలమీద బాదేడు. చుట్టుప్రక్కని ఇళ్ళవాళ్లొచ్చి అడ్డం పడకపోతే సత్యం ప్రాణాలు వెంటనే పోను. పోలీసులొచ్చి సాంబని అరెస్టు చేసి తీసుక పోయేరు. చావు బ్రతుకులమధ్య వూగి అఖరికి సత్యం బ్రతికి బైటపడ్డాడు.

సాంబకి మూడేళ్ళ జైలుశిక్ష పడింది. జైలుకి వెళ్తూ సాంబ ప్రతిజ్ఞ చేసేడు. "మూడేళ్లెంత నోకిలే! ఆనంజ యీమధ్యనెవడితోనన్నా పోయిందా దాన్ని, ఆడినీ కూడా కూనీ చేస్తాను! యీడు పాలారు సాంబడు!"

సత్యం కోలుకున్నాక, అలివేలు సత్యం ప్రాపకంలోకి వెళ్లిపోయింది ఏదో సహజమైన పని చేస్తున్నట్టు. ఆమె అప్పుడూ ఏమీ చలించలేదు.— సాంబ ఎన్నడూ ఆమె జీవితంలో లేనట్టే ప్రవర్తించింది— ఆమె సిద్ధాంతం ఒకటేనని రామో అనుకున్నాడు— తనూ తానొక స్త్రీనేనని ఎప్పుడూ మరిచిపోదు. ఆమెకి కావల్సింది ఒకే మగాడు. ఆ మగాడు తనని ఆదరించి, ప్రేమించినంతకాలం, తాను అతడ్ని ఆదరించి ప్రేమిస్తుంది— తనని ఆ మగాడు వదిలేసిననాడు, తనూ అతడ్ని వదిలేస్తుంది. అదే పోసం..... అదే అందం..... అదే వెలుగు, కళ్లలో.......

బిల్లుచెల్లించి డ్రయివర్లు ఒక్కరొక్కరే వెళ్లిపోయేరు. చెకింగ్ అయ్యేక ఒక్కొక్క లారీ గీపెడుతూ రెండో గేర్లో స్పీడ్ ఎక్కుతున్నాయి. సివిల్ సప్లయి సూపర్‌వైజరు బాబుకి కాఫీ తీసుకెళ్ల డానికి డవాలా బంట్రోతువచ్చి, టీ తాగుతూ కూర్చున్నాడు.

జయపురంలో నాలుగయిదు హోటళ్లు లేచేయి. హోటలుకి బేరం తక్కువయింది. క్రమేపీ నష్టం రావడంతో జయపురం వదిలేసి సుంకిలో హోటలు తెరిచేడు తను. ఆతర్వాత అలివేలు సంగతి అట్టే తెలుసుకోలేదు రామో.

సుంకిమీదుగా లైనుకి వెళ్ళేటప్పుడు సత్యమే అన్ని సంగతులూ చెప్తూ అలివేలు సంగతి చెప్పేవాడు. "గురూ! అదేం ఆడదో నాకు తెల్దు! యెనకటి జల్మం కాడనించి దానికినానే మగాడినైనట్టు అంత ప్రేమగా ఉంటుంది గురూ! నాకే అప్పుడప్పుడు బయమేస్తది ధాని యిదిచూసి..."

సాంబడింక రెండు నెలలకి విడుదల అవతాడనగా సత్యం తత్వం మారి పోయింది. ముఖంలో ఆందోళన భయం ఎప్పుడూ. సలహాలడిగేడు ఏం సలహా ఇవ్వడం? ధైర్యంగా ఉండమన్నాడు. కాని ఒకసారి దెబ్బతిన్న మనిషికి ధైర్యం ఎక్కడ? ఒకనాడు పాలూరు వేపు ట్రిప్పు వెళ్లేడు—మరి జయపురం తిరిగి వెళ్లలేదు సత్యం.

నెలరోజుల క్రిందట— తెల్లవారు జామున ఒక లారీ ఆగింది. డ్రయివరునాని, తలుపు కొట్టి లేపేడు. రామో లేచి తలుపు తీసేడు కళ్లు నులుపుకుంటూ. నాని చెప్పేడు— "గురూ! సత్తెం వారంరోజులయి పత్తా నేదు— సాంబడొచ్చి సంపుతాడని' బయపడి ఉడాయించేడు— ఇదుగో అలివేలు— నీ కాడికి ఒట్టుకపోయి ఒప్పజెప్పమన్నాది— ఒప్పచెప్పేసినాను— నా పూచీ తీరిపోనాది!" అని అలివేలుని అప్పగించి, కాఫీఅన్నా తాగకుండా వెనక్కి తిరిగన్నా చూడకుండా పరుగెత్తి పోయేడు—

అలివేలు, నెల్లాళ్లయి తన మనిషయిపోయింది. ఆమె, తనలోని అంతర్భాగమయిపోయింది. ఆమె జీవితంలో ఇదివరకెప్పుడూ సాంబకాని, సత్యంకాని ఉన్నాడనన్నా ఆమెకు గుర్తున్నట్టు లేదు. తనమీద ప్రేమ, అనురాగం, ఆప్యాయత గాఢంగా కనపరుస్తుంది. ఆమె యొక్క అనుభూతులన్నీ గాఢమైనవే.

అలివేలు అంది— "అసలు ఆరోజున నిన్ను చూస్తినే, నీ కళ్లల్లో, నీకు నా మీదనున్న కోరిక గ్రయించినప్పట్నించీ, ఎప్పుడో ఒకనాడు, నీ దగ్గరికే యెళ్లాలని రాసుందని, నాకు తెల్సు!" ఆమెకి

[illegible]

సత్యం పరారీ అవగానే తనని వెతుక్కుంటూ వచ్చింది. తనొక్కడే ఈ ప్రపంచంలో ధైర్యంగా నిర్భయంగా, చావుకన్నా తెగించి, ఆమెను చేరదియ్యగలడన్న నమ్మకంతో— ఆమె సందేహించనవసరమే లేదు! 'అలివేలు! ఆమె సాహచర్యం తనకు దొరకడమే పదివేలు...... కాని ఆమె తన దగ్గరికొచ్చింది సహాయం కోసంకాదు, తనని అర్పించుకుందుకి— తనని పురుషుడిగా స్వీకరించేందుకు...... ఆమె స్త్రీ కనక—

తనకి సాంబడివల్ల చావు వచ్చినా సంతోషమే, అలివేలు ప్రక్క నుండగా—

పగలు పది గంటలయినా, ప్రొద్దున ఆరు గంటల లానే ఉంది— మేఘాలు ఇంకా దట్టంగా కమ్ముకొస్తున్నాయి—

దోసెల పెనం ఇంక దించేద్దాం అనుకుంటూ ఉండగా, జయపురం నించి గున్నయ్య ఎర్రలారీ వచ్చి ఆగింది— అనుకున్నట్టుగానే అందులోంచి దిగేడు సాంబడు.

సాంబడ్ని చూడగానే రామో ఉలిక్కిపడ్డాడు. బాగా ముసలాడై పోయినట్టుగా అయిపోయేడు సాంబడు. జుత్తు పక్షి గూడులా ఎదిగింది. గడ్డం బాగా మాసింది. జుత్తూ, గడ్డం నెరసిపోయేయి. బాగా తాగిఉన్నప్పటిలా కళ్ళు ఎర్రగా ఉన్నాయి— చేతిలో పెద్ద బాణా కర్ర ఉంది.

లారీ దిగేక సాంబడు, తృప్తిగా కొండల్నీ, మేఘాలనీ, ఘాటీదిగే లారీలని తీవిగా చూస్తూ నిల్చున్నాడు కొంతసేపు—తరువాత హొటలు కేసి నిదానంగా చూసి చూసి, గంభీరంగా ముఖం పెట్టి, ఆవేశాన్ని అపుకుంటూ మెల్లిగా అడుగులు వేసుకుంటూ హొటల్లోకి ప్రవేశించేడు. హొటల్లో ఉన్న డ్రయివర్లు సాంబడు రాగానే చల్లగా జారుకున్నారు.

రామో ఊపిరి బిగ పట్టి నిల్చున్నాడు, తాపీగా దిక్కులు చూస్తూ వస్తున్న సాంబని చూస్తూ. కాని తొణక లేదు. ఆందోళన వ్యక్తం చెయ్యలేదు. సహాయంకోసం కేకలు వెయ్యలేదు.

సాంబడు మెల్లిగా వచ్చి రాముకి ఎదురుగా నిల్చుని, అతడికళ్ళలోకి నిదానంగా చూసిఅన్నాడు "రామోగురూ! నీసాంబడ్ని మరిచి పోయేవా?" ఆ మాటలంటున్నప్పుడు సాంబకళ్ళలో రెండునీటి చుక్కలు మెరిసేయి. అతడి గొంతు గాద్గదికమయింది, ఆ మాటలంటూ ఉంటే.

'సాంబా!" అంటూరామో, సాంబని కౌగిలించు కున్నాడు— కాని రాముకి అనుమానం వేసింది. అలివేలు తన దగ్గరున్నట్టు సాంబకి తెలిదేమో తెలిసి ఉంటే ఇలా ప్రవర్తించడే!

దుఃఖంతో వణికేగొంతుతో అన్నాడు సాంబ. "అలివేలు లోపలుందాగురూ!"

ఆశ్చర్యపోతూ అవునన్నట్టు తల ఊచేడు రామో సాంబలో వచ్చిన మార్పు అనూహ్యమైనది.

కళ్ళు తుడుచుకుంటూ సాంబ అన్నాడు— "గురూ! అలివేలులాటి నిజాయితీమడిసి ఎక్కడా నేదు—నన్ను నమ్ముకున్నంత కాలం మరొడ్ని దగ్గరకు రానివ్వలేదే—అనంగతి నాకు తెల్దూ [illegible] [illegible] [illegible] [illegible]

మొత్తనం ఆగనేదు— సత్తిగాడిని ఆలోజ సంపేసే ఉందును. ఇద్దరికీ చపాపణ సెప్పడానికి జయపురం యెల్లేను నిన్న —కుక్కయెదవ. దాన్ని ఒగ్గేసి పారిపోనాట్ట. పేణం అంటే అంత తీపి, పిరికి సంజకొడుక్కి—నమ్ముకున్న ఆడమడిసిని దొంగెదవల మద్దె ఒంటిగా ఒదిలేసి ఉడాయించేడు. అప్పుడు కాదు గాని, యిప్పుడు ఆడి దుమ్ములిరకొట్టడతాను అగుపడితే! గురూ! ఒక్కసారి అలివేలుని పిలు....దానికాళ్ళ మీద పడిచెమాపణ సెప్పుకుంటాను!

రామోకొయ్యబారి పోయేడు క్షణకాలం— చలనం కలిగేక, దుఃఖం నిండిన మనస్సుతోగాద్గదిక కంఠంతో అన్నాడు. "నిజంగా ఎంతమారిపోయేవ్ సాంబా! నీమంచితనం చూస్తేనాకు సిగ్గేస్తోంది!"

"నీకు సిగ్గెందుకు గురూ! మొగాడివంటే నువు! సావుకి కూడా తెగించి ఒకదిక్కులేని ఆడదాన్ని నీ ప్రాపకంలోకి తీసుకున్నావే..నాకు నిజంగా గురువ్వి..." అన్నాడు ముక్కు ఎగబీలుస్తూ—

రాముకి సాంబడిమీద అపారమైన జాలి, ప్రేమ వాత్సల్యం పుట్టుకొచ్చేయి— అలివేలుని ఈమనిషి, నిజంగా ప్రేమిస్తున్నాడు— ఈమనిషినించి ఆమెని కాజేయడం, ఇతడికి ఆమెను కాకుండాచెయ్యడం తనకి చేతకాని పని— తనూ ఆమెని ప్రాణపదంగా ప్రేమిస్తున్నా తను వంచకుడు మాత్రం కాలేడు. అలివేలు కోసం ఈమనిషి వచ్చేడు— ఆమెను క్షమించమని కోరి, తనతో తీసుకపోయేందుకు— ఎలా కాదన గలడు. తనూ? తన కామెమీదున్న హక్కేమిటి? తను ఆశ్రయమిచ్చినందుకు, నెల రోజులు తనని పురుషుడిగా స్వీకరించింది. అది చాలదా?

రామో బరువుగా అడుగులువేస్తూ ద్వారం వరకూ వెళ్లేడు.

అప్పుడు అలివేలే బైటకు వచ్చింది. ఆమె [illegible] [illegible] [illegible] [illegible] హోటం, పెదవుల కొనని కదిలించి మాయమయింది. ఆమె కళ్ళు ప్రశాంతంగా ఉన్నాయి. ముఖం గంభీరంగా ఉంది.

ఆమెని చూడగానే సాంబ "అలివేలా! నన్ను క్షమించు.....నన్ను క్షమించు అలివేలా" అని ఆమె కాళ్లమీద పడి, రెండు పాదాలనూపట్టుకున్నాడు.

వెళ్లిపోయిన డ్రయివర్లు మళ్ళా ఒచ్చి మూగేరు.

"ఛా! అదేమిటి సాంబా! లే! లే!" అంటూ, రామో సాంబని లేవదీసేడు, ఒకరిద్దరి, సాయంతో

అలివేలుఏమీ మాట్లాడలేదు.

సాంబ, కించిమాత కూలబడ్డాడు ఆమెని వెర్రిగా చూస్తూ—

ఆఖరికి రామో అన్నాడు— "నీ ఐట్టలూ, పెట్టే సర్దుకో అలివేలా......"అలివేలు అదిరిపడి అంది "ఎందుకు?"

రామో ఆమె కళ్ళలోకి విచారంగా చూసి అన్నాడు. "హొటల్లో ఉన్నావు వెళ్లాల్లు..ఇంక నీ ఇంటికి వెళ్లడానికి!"

ఆమె తేరుకొని ప్రశాంత గంభీరమైన గొంతుతో అంది...... "ఇదే నా ఇల్లు! మావేడనుంటే అదే నా యిల్లు!!" ఆమాటలని, గిరుక్కున తిరిగి లోనికి వెళ్లి పోయింది.

సాంబ, నీరసంగా లేచి, రామోభుజం తట్టి అన్నాడు— "వత్తాను గురూ! శెలవ్.....!"

ఆ మాటలని బరువుగా కాళ్లీడ్చుకుంటూ పోయే సాంబని చూసేసరికి రామోకి దుఃఖం ఆగలేదు.

గున్నయ్య ఎర్రలారీ స్టార్టయింది.... వెళ్లి పోయింది బరువుతో. కొండదిగించి మేఘాలు ఒత్తుగా దిగి హొటలును కప్పేసినయ్. హొటలు అందులోని జీవులు వాటిలోని అంతర్భాగాల యినట్టు— ●

